# లాంజిఘర్ కార్మిక, ప్రజానీకంపై క్రూర నిర్బంధాన్ని ఖండించండి

**2019** మార్చి 18న ఒడిషా రాష్ట్రం – కలహండి జిల్లా లాంజిఘర్ వద్దనున్న వేదాంత అల్యూమినా శుద్ధి కర్మాగారం ప్రధాన ద్వారం వద్ద కా॥ దాని బిత్రా అనే కార్యకర్తను హత్యగావించటాన్ని సిపిఐ(ఎం–ఎల్) తీవ్రంగా ఖండిస్తోంది. ఒడిషా పారిశ్రామిక భద్రతా దళం (ఒఐఎస్ఎఫ్) సాగించిన ఈ క్రూరమైన లాఠీఛార్జీలో మరో 50 మంది ప్రజలు తీవ్రంగా గాయపడ్డారు.

వేదాంత పరిశ్రమలోని కాంట్రాక్టు కార్మికులు తమకు పర్మినెంట్ ఉద్యోగాలు కల్పించాలని, తమ బిడ్డలకు విద్యావకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ప్రధాన ద్వారం వద్ద బైఠాయించి ధర్నా చేశారు. రెంగోపలి, ఛత్రాపూర్, బంధగూడ తదితర పరిసర గ్రామాల ప్రజానీకం కూడా ఈ ధర్నాలో పాల్గొన్నారు. లాంజిఘర్ కాంట్రాక్టు కార్మికుల పరిసర గ్రామాల ప్రజల ఉద్యమాన్ని అణచివేయాలనే ఉద్దేశ్యంలో ఓఐఎస్ఎఫ్ బలగాలు అవాంఛితంగా క్రూరమైన లాఠీఛార్జికి పాల్పడ్డారు.

ఈ కంపెనీ స్థాపించే సమయంలో భూములు కోల్పోయిన రైతుల కుటుంబాలకు ఉద్యోగ, విద్యావకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అయితే సం॥లు
గడుస్తున్నా ఈ హామీ కార్యరూపం దాల్చలేదు. ఒడిషా ప్రభుత్వం కూడా యాజమాన్యం ఇచ్చిన హామీని కార్యరూపంలో పెట్టటానికి ప్రయత్నించకపోగా, 2018 మార్చి 19న కార్మికులపై, ప్రజానీకంపై క్రూరమైన దమనకాండకు పాల్పడింది.

2013 గ్రామసభ తీర్మానాన్ని ప్రభుత్వం ఆమలు చేయకుండా, సిఆర్ఎఫ్ బలగాలతో వారిని అణచటానికే చూసింది. యావత్ నియమగిరి పర్వత ప్రాంతమంతా నిరంతరాయ నిర్బంధం నీడలో మనుగడ సాగిస్తోంది. బాక్సైట్ మైనింగ్‌ను వ్యతిరేకించే ప్రజాందోళనకు నాయకత్వం వహిస్తున్న లింగరాజ్ ఆజాద్ యొక్క ఇటీవలి అరెస్టు దీనికి తాజా ఉదాహరణ.

నియమగిరి పర్వత సానువులలో నివసిస్తున్న ప్రజానీకం ఎన్నో బాధలననుభవిస్తున్నారు. బాక్సైట్ మైనింగ్ కారణంగా వంశధార నది పూర్తిగా కాలుష్యమౌతోంది. దీని ఫలితంగా ప్రజలు తాగునీటి సమస్యనెదుర్కోవటంతోపాటు, అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. అలాగే బూడిద చెరువులు కూడా ఎంతో జీవవైవిధ్యమున్న ఆ ప్రాంతాన్ని నాశనం చేస్తున్నాయి. వీటి నిరోధానికి ప్రభుత్వం చర్యలేమీ తీసుకోకపోగా, ఉనికిలో వున్న చట్టాలను కూడా నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ల ప్రయోజనాలకు తోడ్పడుతున్నది.

ప్రజలు ప్రజాస్వామికవాదులు, బాక్సైట్ మైనింగ్‌తో సాగిస్తున్న కార్పొరేటు హింసకు వ్యతిరేకంగా గళమెత్తాలి.

ooo